# ఈ కథకం కావాలే కాని ఫుల్‌స్టాప్ లేదు

వీధి బడిపంతులు వుద్యోగం పోతుందని మొత్తుకొంటే జాలిపడి కొడుకును అప్పుడెప్పుడో బళ్లో చేర్చేడు కాని, తీటలాగా ఆ చదువు కొడుకును అంటుకొంటుందని అనుకోలేదు లింగయ్య. సూరిబాబు చదువులో ఎక్కుతుంటే లింగయ్య కంగారుపడిపోయాడు.

"మట్టి మోసుకొనే వోళ్ళం, మన కెందుకురా సదువులు? ముగ్గరం పనే్స్తే ముప్పొద్దులా ఆయిగా తినొచ్చు" అంటూ కొడుకు చదువు మాన్పించాలని ప్రయత్నించాడు. కారణాలేమైతేనేం కాని ఏవీ ఫలించలేదు. సూరిబాబు చదువును, చదువు సూరిబాబును వదల్లేదు.

క్రమంగా లింగయ్య కూడా ఆ ప్రయత్నం మాని కొడుకు తెలివితేటల్ని చూచి మురిసిపోవటం అలవాటు చేసుకొన్నాడు.

లింగయ్య, అతని భార్య రంగమ్మ యిద్దరూ మట్టిపనిచేస్తుంటారు. వాళ్ళకు పుట్టిన సూరిబాబు కులానికి, ధనానికి వెనకబడ్డవాడే అయినా చదువులో, గుణంలో ఎప్పుడూ ముందే వుండేవాడు.

సూరిబాబు పదోతరగతి మంచి మార్కులతో ప్యాసయినరోజుల్లో అతని తల్లి మట్టితట్ట మోస్తూ కాలుజారి పునాదిగోతిలో పడింది. అప్పటినుంచి అవిటి తనంతోపాటు అనారోగ్యమూ ఆమెకు సంక్రమించింది.

తన వొక్కడి సంపాదనతో సంసారాన్ని యీదలేక లింగయ్యే అప్పుడప్పుడూ రాత్రిళ్ళు రిక్షా తొక్కేవాడు. అప్పుడు సూరిబాబు చదువు అంతటితో మానేసి ఏదైనా వుద్యోగం చూచుకొంటానన్నాడు. చిత్రం! లింగయ్యే అందుకు అంగీకరించలేదు.

"యిట్లా రాత్రింబవళ్ళు కష్టపడ్తే నీ ఆరోగ్యం ఏమవుతుంది?"

"రేతిరింబవళ్ళు సెమటలుగక్కేవంటికి జబ్బుర్లావురా. అదురుట్టం బాగుండకపోతే మీ అమ్మలాగా కాలుజారి పెమాదంలోపడాల్సిందే. నాకేం పర్లేదుగాని నువ్వు బాగా చదువుకొని కలకిటీరువిగా."

ఇంటరులో చేరేడేగాని అతను తండ్రి పడే కష్టాన్ని గమనిస్తూనే వున్నాడు. తన చదువుకు స్కాలర్‌షిప్పు వుంది. పర్వాలేదు. కాని తన తిండి, యితర ఖర్చులు? తల్లి మందులు?

ఎమర్జన్సీ ఎప్పుడుపోతుందా అని దీనంగా ఎదురు చూచిన భారత ప్రజల్లా ఎప్పుడెప్పుడు ఆ ఇంటర్ కాస్తా అయిపుచ్చి వుద్యోగంలో చేరుదామా అని ఎదురు చూడసాగేడు సూరిబాబు.

పరీక్షలు రెండు నెలల్లోకి వచ్చాయి. సూరిబాబు బాగా చదువుతున్నాడు.

అలాంటి సమయంలో దురదృష్టం మరోసారి ఆ యింటిని వరించింది. పగలు కూలికి పోయొచ్చిన లింగయ్యే రాత్రికి రిక్షా వెయ్యలేక పోయాడు. శరీరం కాలిన పెనమే అయింది.

అయినా మర్నాటిపొద్దున యింత గంజి తాగి మామూలుగానే కూలికెళ్లేడు. యిలా పగలు కూలి - రాత్రి జ్వరం - మూడురోజులు గడిచింది.

నాలుగోరోజు తెల్లవారేక లేచేఓపిక లేకపోయింది. మూసినకన్ను తెరవలేదు. మధ్యాహ్నానికి ఎవరో నాటుడాక్టర్ని తీసుకొచ్చి చూపిస్తే టైఫాయిడ్‌గా తేల్చేశాడు. మందులు రాసిచ్చాడు.

రెక్కాడితేగాని డొక్కాడని సంసారం. మందులు కొనటానికి యింట్లో డబ్బేది ? మందులేకాదు - ఆరోజు అతనికీ, తల్లికీ తిండిలేదు.

రెండురోజులు యిరుగు పొరుగు వాళ్ళను ఆశ్రయించి రంగమ్మే తమకు తిండి, మొగుడికి మందుల్ని గడుపు కొచ్చింది.

యీ రెండురోజులూ సూరిబాబు ఆలోచించాడు. మరుసటిరోజు కుల వృత్తి అయిన కూలిపని చేసి సంపాదించటానికి నిర్ణయించుకొన్నాడు. యిరుగు పొరుగుల్నుంచి యింకేమీ పుట్టదని గ్రహించిన రంగమ్మ కూడా గత్యంతరంలేక అతని నిర్ణయాన్ని ఆమోదించింది.

ఆ రాత్రే లింగయ్య పరిస్థితి కాస్త ప్రమాదించింది. నాటు డాక్టరు వచ్చి చూచి "జ్వరం వచ్చాక అన్నం తిన్నాడా ? అని అడిగేడు. గంజి తాగి పనిచేసిన వైనం తెల్సుకొన్నాక కంగారు పడిపోయాడు.

"యిప్పుడు వాడే మందులు చాలవు. మంచిమందులు రాసిస్తాను. ఖరీదెక్కువైనా వాడక తప్పదు." అంటూ ఖరీదు చెప్పి చీటి రాసిచ్చాడు.

"పోనీ దరమాసపత్రికి తీసుకెళ్ళమంటారా ?" అంది రంగమ్మ.

"అక్కడ యీ మందు లివ్వరు. అసలేదో మందు నోట్లో పడే సరికే రోగి ప్రాణం కడగట్టిపోతుంది. యీ స్థితిలో రోగిని అక్కడికేం తీసికెళ్తారు ? పైగా రేపు బంద్-తెలీదా ?"

"బందా !" సూరిబాబు ఆశ్చర్యపోయాడు.

"ఏమి స్టూడెంటువయ్యా నువ్వు ? రేపు "బంద"ని కూడా తెలీదా ? పోనీ "బంద్" అంటే ఏమిటో తెల్సా ?"

సూరిబాబుకు భయం వేసింది. తండ్రిని రేపు ధర్మాసుపత్రికి తీసుకు పోయే వీలుండదని కాదు. తనకి కూలిపని చిక్కుతుందా అని ?

"అంతగా మీదగ్గర డబ్బెక్కువగా వుంటే విజిటింగ్ ఫీజులు

పుచ్చుకొనే డిగ్రీ డాక్టర్ల దగ్గరికి తీసికెళ్ళండి. లేకపోతే మాత్రం రేపు యీ మందులు వాడండి. రేపు సాయంకాలానికి యీ ఇంజక్షన్ తీసుకొచ్చి రెడీగా వుంచండి. నేను రాత్రికొచ్చి చేస్తాను" అంటూ డాక్టరు వెళ్ళి పోయాడు. ఆ రాత్రిని, రంగమ్మ ఆదుర్దా, సూరిబాబు ఆలోచనలు మింగే శాయి.

తెల్లవారింది-దిగాలు పడ్తూ !

అసలు కథ సరిగ్గా అప్పుడే ప్రారంభమయింది.

....................

....................

ఎలాగైనాసరే ధనార్జన చేయాలన్న నిర్ణయంతో బయటికొచ్చిన సూరిబాబుకు మిల్కుబూతుదగ్గర పాలు రాలేదని నిరాశపడిపోతూ చేతకాని ప్రభుత్వాన్ని, చేతైన బంద్ నిర్వాహకుల్ని తిట్టుకొంటున్న మధ్యతరగతి గుంపు కన్పించింది.

అలాగే బస్సుస్టాపుల దగ్గర - హోటళ్ళదగ్గర.

పాలు, బస్సులు, యిడ్లీలు లేకపోతే మనిషి బతకొచ్చు. మందు లేకపోతే తనతండ్రి బతకడే అని ఆత్రుతపడ్తూ కూలిపనివాళ్ళు పొద్దున్నే పోగయ్యే కేంద్రానికి చేరుకొన్నాడు.

"యివాళ బంద్. మా సభ్యులకే పనిలేదు. కొత్తవాడివి. నీకా ?" ఏ మేస్త్రీని పని అడిగినా యిదేమాట. చివరికి తన తండ్రిపేరు వుపయోగించుకోక తప్పలేదు.

"లింగయ్య కొడుకువా ? సదువుతున్నావుకదూ ? నువ్వేం పని సేత్తావ్ ? దయదల్చి తీసకపోయినా మాకు మాటొస్తుంది. యింకోపని చూసుకో - పో." కొందరు పనుల్లోకి పోయారు. చాలామంది పనిలేక తిట్టుకొంటూ ఎక్కడికోవెళ్ళేరు.

"బంద్" అయినా కొందరు షాపుల వాళ్ళు తలుపులు సగంసగం తెర్చారు. పనికోసం వాళ్ళందర్నీ అర్థించాడు.

"ఏడ్చినట్లుంది.... ఇవాళ అసలు కొట్లే మూయిస్తారని మేము భయ పడుంటే నీ గోలేమిటి ? మూయించకపోయినా మాపనివాళ్ళకే పనివుండ దివాళ."

తండ్రి రిక్షా తీసుకొనే షెడ్ దగ్గరికెళ్ళాడు. తనని పరిచయం చేసు కొన్నాడు - యజమానికి.

"లింగయ్య కొడుకువా ? ఏది ? ఇంటర్ చదివేవాడివే ! మరి రిక్షా తొక్కాల్సిన ఖర్మేంపట్టింది నీకు ? అందులోనూ "బంద్" రోజు ?"

యజమానికి తన పరిస్థితి వివరించాడు.

"పిచ్చోడిలాగున్నావే. ఇవాళ రిక్షాలు రోడ్డుమీద తిరుగుతాయా ? అయినా స్టూడెంటు కుర్రాడివి. బంద్‌రోజు రిక్షాతొక్కి సంపాదించుకోవా ల్సిన ఖర్మేమిట్రా ! నువ్వు "ఊఁ" అంటే ఈరోజుకి నీకు డబల్ కూలీ గిట్టే వుద్యోగం యిప్పిస్తాను" అంటూ వో చిరునామా చెప్పి పంపేడు రిక్షాల యజమాని.

వెతుక్కొంటూ చిరునామాను చేరుకొన్నాడు సూరిబాబు.

అక్కడంతా హడావుడిగా వుంది. రెండు ఫోనులు వొకటే మోగు తున్నాయి. తిరణాల జనంలా అక్కడి జనం వూరికే హడావుడిగా పోతు న్నారు. అక్కడ వోపెద్దను కల్సుకొన్నాడు సూరిబాబు.

"అరె ! ఇప్పుడే మీ స్టూడెంట్ల వాలంటీర్ దళాన్ని "బస్సుల యూనిట్ల"కు పంపించానే. పోనీలే. "కొట్లయూనిట్"కి వెళ్ళు."

ఆ యూనిట్లేమిటో, వాలంటీరు దళాలేమిటో, వారి కర్తవ్యమేమిటో మరి కాసేపటికి తెల్సేయి సూరిబాబుకు.

"మీకు తెల్సు - బంద్ వాలంటీర్ల విధులు బృహత్తరమైనవి.

అందులోనూ మీది కొట్ల యూనిట్. ఊళ్ళో వోకొట్టు తెరవబడ్డా బంద్ విఫలమైనట్లే. ఊరి జనమంతా ఆ కొట్టుమీద విరుచుకుపడి కొనుక్కుపోతారు. ప్రజాజీవితం స్తంభింప చేయటం మన లక్ష్యం. అందుకు ఏ మార్గం అనుసరించటానికి మీరు సందేహించకూడదు. బెదిరించో, (అవసరమైతే) బలప్రయోగం చేసో కొట్లను మూయించాలి. అయితే మన ఘర్షణ కొట్లవారితో కాదు, ప్రభుత్వంతో. అంచేత ఏగొడవ జరిగినా పోలీసు దృష్టిని ఆకర్షించి పెద్దది చేసేదిలా వుండాలి.

సూరిబాబు యిదంతా విన్నాడు. "ఛీ! ఏంప్రజాసేవ యిది?" అనుకొన్నాడు నాయకుల్ని వుద్దేశించి. కానీ అవసరం....తండ్రి ఆరోగ్యం, మందులు, డబ్బు....

"మీపని మీరు సక్రమంగా నెరవేరిస్తే సాయంకాలానికి మీగ్రూప్ లీడర్ మీకు....డబ్బుయిస్తాడు. మధ్యాహ్నం మీకు భోజనం - హోటల్లో ఫ్రీ. అందాకా పై ఖర్చులకుగాను మీ నాయకుడు బయల్దేరేముందు - రూపాయలు యిస్తాడు___"

సూరిబాబుకు ఆ అంకెలే విన్పించాయి. ఆకర్షణగా వున్నాయా అంకెలు.

కొట్ల యూనిట్ మళ్ళీ ఉపదళాలుగా చీలింది. వొక్కోదళానికి వొక్కోలొకాలిటీ అప్పగించారు. సూరిబాబు లొకాలిటీ వూరికి నాడీకేంద్రం. మందుల కొట్లన్నీ అక్కడే వున్నాయి.

"గురూ, నువ్వు ముందు మాటల్తో యుద్ధంచేయి. మేము ఆ తర్వాత జోక్యం కలిగించుకొని అసలు యుద్ధం చేస్తాం. దళనాయకుడు సూరిబాబుతో అన్నాడు. ఆ దళంలో సూరిబాబే చదువుకొన్న యువకుడు.

దళంతోపాటు సూరిబాబు కూడా రోడ్డుమీద పడ్డాడు. ఆ గుంపును చూడగానే సగం తెర్చిన తలుపుల్ని మూయసాగేరు కొట్ల యజమానులు.

సూరిబాబు చక్రవర్తి అయినంత థ్రిల్ పొందేడు. దాన్ని అనుసరించి మూకతత్వం అతనిని ఆవరించింది. విజృంభించాడు.

ఇంటా బయటా ఎన్నడూ పెదవి విప్పని మనిషి ఆరోజు రౌడీలలో రౌడీగా ప్రవర్తించాడు. "రోగులు చచ్చిపోతారన్న" మిషపై మెడికల్ షాపు మొయ్యటానికి మొరాయించిన వో షాహుకారుతో తీవ్రంగా ఘర్షణ పడ్డాడు. ఆ యజమాని నాటకాన్ని తూర్పారబట్టేడు. యిది అదునుగా తీసుకొని అతని వెనుకనున్న బలగం యజమానిని చావమోదేరు. షాపు అద్దాలు, మందుల సీసాలు బద్దలు చేసేరు.

యిలా వొకటికాదు....కలలోకూడా వూహించని ఎన్నో అనుభవాలు- మనస్సుకు "కిక్" యిచ్చి మరింత వుద్రేకపర్చే ఘట్టాలు-

సాయంకాలమయింది.

బంద్ ప్రశాంతంగా తాము జరిపేమని, పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకొని ఘాతుకచర్యలు జరిపేరని బంద్ నిర్వాహకులు ఆరోపించారు. బంద్ ప్రశాంతత విలువ = పది ప్రాణాలు ప్లస్ పలుమందికి గాయాలు.

అవేమీ పట్టించుకోలేదు సూరిబాబు.

అతని విశిష్ట సేవను గుర్తించి దళనాయకుడు అతనికి అందరికన్నా నాలుగు రూపాయలు ఎక్కువ ముట్టచెప్పేడు.

మూకను వదిలేక మైకం దిగింది. జబ్బుతో వున్న తండ్రి, తిండిలేని తల్లి గుర్తుకొచ్చారు. అయినా జేబులో డబ్బుందన్న ధీమా - ఉత్సాహం.

యింటికొచ్చి పరిస్థితిని చూచి నీరు గారిపోయాడు. తండ్రికి స్పృహ లేనంత టెంపరేచర్. తల్లి తిండిలేక నీరసించి పోయింది.

"మీనాన్న... మందు....డాక్టర్...."

"తీసుకొస్తానమ్మా మందులు ...రొట్టెలు....అన్నీ తీసుకొస్తాను.

యిప్పుడే...." డాక్టరు రాత్రి యిచ్చిన ప్రిస్క్రిప్షన్ తీసుకొని రోడ్డుమీదికి పరుగెత్తేడు సూరిబాబు.

....................

....................

పోలీస్ రైడ్ తర్వాత వేశ్యవాటికలా వెలావెలాపోతోంది మెయిన్ బజారు. రైడ్‌ను తప్పించుకొన్న వేశ్యలకు ఆ రాత్రి డిమేండు పెరిగి పోతుంది. వీరవిహారం చేస్తారు. అలాగే బజార్లో కొన్ని షాపులు తెరవ బడ్డాయి. ఆ షాపులు రద్దీగా వున్నాయి. సరుకుల కోసం కష్టమర్సు ఎగ బడ్తున్నారు.

సూరిబాబు వో పెద్ద మెడికల్ షాపులోకి పరుగెత్తేడు. రాజకీయ నాయకుల చేతుల్లో వుద్యమాల్లా అతని గుండె ఎగసిపడి అంతలోనే తగ్గి పోతోంది.

"సార్....సార్....ముందు యీ మందు యివ్వండి" రొప్పుతూ చీటీ మందులిచ్చే వ్యక్తి ముందుంచాడు.

ఆ వ్యక్తి సూరిబాబువైపు చూచాడు. మాట్లాడకుండా మందు తీసి చేతిలో పట్టుకొని ఖరీదు చెప్పేడు.

సూరిబాబు గుండె గుభేలుమంది. అతను ఆరోజు సంపాదించిం దంతా కూడా అంతలేదు. అంతలోనే డాక్టరు చెప్పిన ఖరీదు గుర్తుకొచ్చింది.

"అంత ఖరీదా ! డాక్టరు అంత అవుతుందని చెప్పలేదే ?" అంటూ సూరిబాబు డాక్టరు చెప్పిన ఖరీదు చెప్పేడు.

"నిజమే. దాని అసలు ఖరీదు అంతే. కానీ యివాళ బంద్ రోజు. పొద్దుటి నుంచి మాకు వచ్చిన నష్టం ఖరీదు అపైది."

సూరిబాబుకు కోపం వచ్చింది. ఉద్రేకంతో వూగిపోయాడు.

"ఎవరో బంద్ జరిపితే శిక్ష మాకా ?"

అంతవరకు గల్లాపెట్టె ముందు కూర్చున్న వో పెద్దమనిషి యిప్పటికి జోక్యం కలగచేసుకున్నాడు.

"ఎవరో నడిపించారా ? వొక్కసారి యిటు నామొహం చూచి చెప్పు."

సూరిబాబు అతనివైపు చూచాడు.

పొద్దున తను ఘర్షణపడ్డ షాహుకారు ! తన బలగం తన్నిన షాహుకారు. తలకు కట్లువున్నాయి. మందుల సీసాలు బద్దలుచేయబడ్డ షాపు యిదే ...

సూరిబాబు తల తిరిగిపోయింది.

"ఉద్యమాలు నడపేవారు, బంద్‌లు చేయించేవారు బాగానే వున్నారు. ఎవరికి వ్యతిరేకంగా అవన్నీ చేయిస్తున్నారో వారు బాగానే వున్నారు. మధ్యలో చెడుతోంది ఎవరో తెల్సుకొన్నావా నాయనా ? నువ్వు, నేను - మనలాంటి వారెందరో ?

సూరిబాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. జేబులో డబ్బంతా తీసి, బల్ల మీద వుంచాడు.

"నా దగ్గరవున్న డబ్బంతా యిదే. మందు లేకపోతే మా నాన్న చచ్చిపోతాడు. యీ డబ్బంతా తీసుకొని ఆ మందివ్వండి. యివ్వరూ ?"

డబ్బు గల్లాపెట్టెలోకి పోయింది. మందు సూరిబాబు చేతుల్లోకి వచ్చింది. పరుగు మళ్ళీ ప్రారంభమయింది.

సూరిబాబు శరీరంకన్న ఆలోచనలు మరీవేగంగా పరుగెత్తసాగేయి.

షాహుకారు చెప్పింది కొంతవరకు నిజమే. కానీ వాడేం బాధపడ్డాడు ? నష్టపోతున్నాడు ? వాడి నష్టాలని, కష్టాలని కష్టమర్సు నెత్తిన రుద్దుతున్నాడు.

అసలు నష్టం ఎవరిది ? అడ్రస్ లేని ప్రజలది.

బంద్ నిర్వహణలో తనలాంటి చీమలెందరో ? పాములచేతుల్లో నడిచే పావులు. చీమలన్నీ చేరి మరోపామును కట్టేశాయి.

ఆపాము - యీ పాము - మధ్య చీమల గుంపు. ఏదో పాము చేతులో పావులు. ఆ పామో యీ పామో మింగేస్తుంది. చీమలు పెట్టిన పుట్టలు పాములకు స్వర్గసౌధాలు !

పెద్ద బ్రెడ్‌షాపువద్ద పరుగు ఆగింది. జేబులు తడుముకొన్నాడు సూరిబాబు. నిట్టూర్చాడు, ఏడ్చాడు.

తల్లి తిండికి, తండ్రి మందులకి రెండు రోజులు సరిపోతుందను కొన్న సంపాదన క్షణంలో దోపిడీ చేయబడింది.

తిండిలేక నీరసంతో చనిపోతున్న తల్లి బొమ్మ - కంటిపొరపై క్షణం మెదిలింది. రేపు....రేపు.... మరోకంటి పొరపై భీకరంగా కన్పిం చింది.

రేపు మరో బంద్, మళ్ళీ తను షాపు, మళ్ళీదోపిడీ మళ్ళీపరుగు !

నో... వీల్లేదు ...

ఏదో ఇన్‌స్టింక్ట్ అతడిని ముందుకు తోసింది. వంగి రోడ్డుమీద నున్న రాయిని చేతిలోకి తీసుకొన్నాడు.

"బ్రెడ్లు కావాలి."

"ఎన్ని ?"

చెప్పేడు.

"యివిగో—" అంటూ దుకాణపు యజమాని డబ్బు చెప్పేడు !

మళ్ళీ అదేకథ. దోపిడీ, డబల్ రేటు.

"యిదుగో. యిది - యీ రొట్టెల వెల."

యజమాని మొహంమీది నుంచి రక్తం కారసాగింది.

సూరిబాబు ఆగకుండా నేరుగా పరుగెత్తుతూనే వున్నాడు. అతని ఆలోచనలు మాత్రం అటూ యిటూ పరుగులు తీస్తున్నాయి.

అటా ? ఇటా ? మార్గం ఎటు ?

అతని కాళ్ళు ఆగేయి, కళ్ళు మంచం మీది తలిదండ్రుల్ని చూచేయి.

ఆకలి - అనారోగ్యం - మృత్యువు - దుప్పటై వాళ్ళను కప్పేసింది.

సూరిబాబు ఆలోచనలు అన్నంలా వుడికి వుడికి పొంగసాగాయి.

మందు సీసాను బలంగా గోడకు విసిరికొట్టేడు. గాంధీగారు దభీమని కిందపడి మూలిగాడు.

రొట్టెల్ని నేలపై విసిరివేశాడు. నెహ్రూగారు ఏడుస్తూ తుంపుల్ని ఏరుకో సాగేడు.

సూరిబాబు వెనక్కి తిరిగి పరుగు మళ్ళీ ప్రారంభించాడు.

ఇక యీసారి ఆ పరుగు ఆగదు.

యీ కథకు కామాలేకాని ఫుల్‌స్టాప్ లేదు.

(స్వాతి - జనవరి 1979)